క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం ఉప సర్పంచ్ దుంప ఈశ్వరరావు తల్లి రమణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి, నాయకులు దుంప చిన్నారెడ్డి, ముద్దాడ శంకర్, కారి తాతారావు, మజ్జి జగదీశ్వరరావు, బోర గోవిందరెడ్డి, గవిరెడ్డి రవికుమార్ ఉన్నారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పరామర్శించి సంతాపం తెలియజేశారు.

స్వర్ణ కిరీటానికి విరాళం



బంగారం అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వర దేవాలయంలో కొలువైన స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం బి.వేణుగోపాలకృష్ణ, అరుణలత దంపతులు పావుతులం బంగారం సమర్పించారని అర్చకులు గోపాలాచార్యులు శనివారం తెలిపారు. బుడుమూరు శ్రీరాములునాయుడు, వనిత దంపతులు రూ.10,116 విరాళం అందజేశారని చెప్పారు.

కార్మికుడికి సీఐటీయూ నాయకుల పరామర్శ

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం ఏపిటోరియా ఫార్మా పరిశ్రమలో జనవరి 30న కూలింగ్ టవర్ ఫ్యాన్ మరమ్మతులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో కార్మికుడు పసుమూర్తి రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయనగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని శనివారం సీఐటీయూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, కె.సురేష్‌లు పరామర్శించారు.

ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. శనివారం దవళపేటలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలను ఇప్పటికిప్పుడు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయడంలో వైఎస్సార్ సీపీ ముందుంటుందన్నారు. సమావేశంలో కంచరాన రమణారావు, పేడాడ శ్యామలరావు, పేడాడ దుర్గా అప్పారావు, పేడాడ నారాయణరావు, పేడాడ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకం



పౌరాణిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

శ్రీకాకుళమ కల్చరల్: బాపూజీ కళామందిర్‌లో రంగస్థళల కళాకారుల 304వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కాళహస్తీశ్వర మహత్యం పౌరాణిక పద్య నాటక ప్రదర్శన శనివారం జరిగింది. రాజాంకు చెందిన కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకానికి రచన మీగడ రామలింగస్వామి అందించగా, దర్శకత్వం, సంగీతాన్ని మీగడ మల్లిఖార్జున స్వామి అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.రామలింగస్వామి, న్యాయవాది మీగడ వినయభూషణ్, డాక్టర్ నిక్కు అప్పన్న, లైన్స్ క్లబ్ మెంటర్ నటుకుల మోహన్, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, ఇంజరాపు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రణస్థలం: కొండములగాం రహదారిపై శనివారం రాత్రి 8.15 గంటల సమయంలో గ్రావెల్ లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న పొందూరు మండలం దల్లివలస గ్రామానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కొండములగాం గ్రామానికి చెందిన గ్రావెల్ లారీ డ్రైవర్(మైనర్‌గా అనుమానిస్తున్నారు) ప్రమా దం జరిగిన వెంటనే పారిపోయాడు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోశాల–రాధాకృష్ణ మందిరం..

సకల కళా వైభవం



రూ. 15 కోట్లతో రూపుదిద్దుకుంటున్న గోశాల- శ్రీరాధాకృష్ణ మందిరం

- కోష్టలో ప్రారంభానికి సిద్ధమైన 'గోశాల–రాధాకృష్ణ మందిరం'
- జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాల ప్రతిష్టాపనకు సన్నాహాలు
- ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు ప్రతిష్టాపనోత్సవాలు
- దేశం నలుమూలల నుంచి స్వామీజీలు రాక



జగన్నాథుడు, సుభద్ర, బలరామ విగ్రహమూర్తులు

రణస్థలం: సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణం.. రూ.15 కోట్లకు పైగా వ్యయం.. 108 అడుగుల ఎత్తు 75 అడుగుల వెడల్పుతో సుమారు ఐదేళ్ల పాటు కొనసాగిన అద్భుత ఆధ్యాత్మిక నిర్మాణం మరో మూడు రోజుల్లో ప్రారంభానికి సిద్ధమవుతోంది. పూరీ మహా పుణ్యక్షేత్రాన్ని తలపించేలా రణస్థలం మండలం కోష్టలోని గోకులానంద ఆశ్రమంలో నిర్మించిన గోశాల– శ్రీశ్రీ రాధాకృష్ణ మందిరం భక్తులకు కనువిందు చేయనుంది. జాతీయ రహదారికి ఆనుకుని శ్రీ కృష్ణ చైతన్య మఠం శాఖ సారథ్యంలో రాజస్థాన్ శిల్పులు నిర్మించిన ఈ మహత్తర ఆల యం ఉత్తరాంధ్రకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ప్రత్యేక ఆకర్షణగా గోశాల

15 ఎళ్ల క్రితం 100 గోవులతో ప్రారంభమైన గోశాల నేడు 400 గోవులతో అలరారుతోంది. కాంక్రీజ్, గిరి, సాయివాల్, రాఠీ, ఒంగోలు, పుంగనూరు, హర్యాన ఇలా విభిన్న రకాల జాతులైన గోవులు దర్శనమిస్తాయి. వీటి పోషణకు 15 మంది సేవకులు నిరంతం పర్యవేక్షిస్తుంటారు. నెలకు దాణాకు ఖర్చు రూ.3.5 లక్షలు పైనే. వైద్యం, విద్యుత్, ఇతర నిర్వహణకు రూ.1.5 లక్షలు వరకు ఖర్చు అవుతుంది. స్వచ్ఛమైన నెయ్యి దొరకడం ఇక్కడి ప్రత్యేకత.

భక్తులకు ఆహ్వానం



ఫిబ్రవరి 3 నుంచి 7వ తేది వరకు జరిగే జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి గోకులానంద ఆశ్రమానికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. హిందూ సనాతన భక్తులంతా హాజరై మహోత్సవ ఘట్టాన్ని విజయవంతం చేయాలి.

– భక్తి సాధవ కేశవ గోస్వామి మహారాజ్,
శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు



గోశాలలో గోవులు



గోశాల- శ్రీరాధాకృష్ణ మందిరం నమూనా ఆలయం



రూ. 5కోట్లతో నిర్మించిన విడిది గృహం

ఎన్నెన్నో ప్రత్యేకతలు..

- ఆలయ నిర్మాణానికి పింక్ స్టోన్‌ను వినియోగించారు. పూరీ ఆలయాన్ని తలపించేలా రాజస్థానీ శిల్పులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.
- ఉత్సవమూర్తులను మధ్యప్రదేశ్‌లోని ఉజ్జాయినీ, రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి తీసుకువచ్చారు. థారు, పాల, నల్ల రాతితో చేసిన విగ్రహమూర్తులు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి.
- రెండు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టారు. మొదటి అంతస్తులో జగన్నాథుడు, సుభద్ర, బలరామ సుభద్ర సమేత మూర్తులు, భక్తీ త్రిదండ స్వామి, భక్తి వైభవ పూరి గోస్వామి మహారాజ్, జగద్గురు శ్రీల ప్రభుపాద పరమ పూజ్య పాద భక్తీ సిద్ధాంత సరస్వతి ఠాకూరు విగ్రహాలు దర్శనమిస్తాయి.
- రెండవ అంతస్తులో ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటిదైన అష్టభుజ లక్ష్మీనరసింహ అవతార స్వామి నల్లరాతి విగ్రహం, నిత్యానంద ప్రభు, చైతన్య ప్రభు, రాధా గోవింద విగ్రహాలు కొలువుదీరుతాయి.
- తూర్పు ముఖంగా సింహద్వారం, ఉత్తర ముఖంగా హస్తీ (ఏనుగులు), పశ్చిమ ముఖంగా వ్యాఘ్ర ద్వారం, దక్షిణ ముఖంగా అశ్వాలతో కూడిన ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయ గోపురాన్ని వెంకటేశ్వర నామంతో విరాట గరుడ పక్షి ఆకారంలో రూపొందించారు.
- 2020లో రాజస్థాన్ నుంచి విచ్చేసిన శిల్పులతో ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. సుమారు 15 కోట్లు వ్యయంతో ఐదేళ్లుగా సాగుతోంది. ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. 51 మంది శిల్పులు అత్యంత నియమ నిష్ఠలతో ఆలయ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు.
- రూ.5 కోట్లతో వసతి గృహం నిర్మాణం చేపట్టారు. ఐదు అంతస్తులలో 500 మంది విడిది ఉండేలా 40 గదులు నిర్మించారు. గోసేవలు, అర్చకులు, బ్రహ్మచారులు, మఠం సేవకులు, పీఠాధిపతులు ఇలా వివిధ ప్రదేశాల నుంచి విచ్చేసే వారికి ఇక్కడ ఏర్పాట్లు చేశారు.

ఐదు రోజుల వేడుకలు..

ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు రాధా గోకులానంద విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరుపతి, అహోబిలం, పూరి, కాశీ, అయోధ్య, బృందావనం వంటి పుణ్య క్షేత్రాల నుంచి స్వామీజీలు, సాధు మహాత్ములు విచ్చేయనున్నారు. 51 మంది రిత్వికులతో యజ్ఞ యాగాలు, 100 మందితో 120 గంటల పాటు నిర్విరామంగా అఖండ హరినామ సంకీర్తనలు జరుగుతాయి. భరతనాట్యం, అన్నమాచార్య కీర్తనలు, సుందకాండ, గీతా, విష్ణు సహస్ర నామ పారాయణాలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు మూడు పూటలా నిత్యాన్న దానం జరుగుతుంది. ఫిబ్రవరి 8 నుంచి ఆలయ దర్శనార్థం విచ్చేసే భక్తులకు నిత్య అన్నదానం ఉంటుంది.

మత్స్యకార ఎన్నికల్లో గందరగోళం



కొవ్వాడలో ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

రణస్థలం : జీరుపాలెం, కొవ్వాడ మత్స్యలేశం గ్రామాల్లో శనివారం జరిగిన సాగర సహకార సంఘం ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. జీరుపాలెంలో ఒకే పార్టీ నామినేషన్ దాఖలు చేసి ఏకగ్రీవంగా సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. కొవ్వాడలో మాత్రం గందరగోళం మధ్య కూటమి అభ్యర్థిని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని వైఎస్సార్ సీపీ తరపు సభ్యులు ఆరోపించారు. సంఘం రికార్డులు లేకుండా నామినేషన్ దాఖలు చేశారని, పెన్నుతో రాసిన జాబితా మేరకు ఎన్నిక జరిపించారని విమర్శించారు. అధికార పార్టీ సభ్యులకు అనుకూలంగా జరగడంతో తామంతా బయటకు వచ్చేశామని, అందుకే ఎన్నిక వాయిదా వేయాలని కోరుతూ ఎన్నికల అధికారి వై.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కాగా, జీరుపాలెం అధ్యక్షుడిగా కామేశ్వరరావు, కొవ్వాడ అధ్యక్షుడిగా మైలపల్లి అప్పన్నతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, డైరెక్టర్లను గందరగోళం మధ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్సై ఎస్.రాజేష్, 30 మంది పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

అంకితభావంతో చదివితేనే విజయం



అనుగ్రహభాషణ చేస్తున్న గోపాలకృష్ణ శాస్త్రి

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు శ్రద్ధగా చదివితేనే విజయం సాధించవచ్చని శృంగేరి పీఠం ఆస్థాన పండితులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో గుజరాతీపేట రాజరాజేశ్వరీ లలితా త్రిపుర సుందరీ దేవి పీఠం నిర్వహణలో విద్యార్థులకు సంస్కార సుధ కార్యక్రమంలో భాగంగా రెండో రోజూ అనుగ్రహ భాషణ చేశారు. చెడు ఆలోచనలకు దూరంగా ఉంటూ మానవత్వంతో మెలగాలన్నారు. అమెరికా వంటి దేశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు శృంగేరికి వచ్చి భగవద్గీత 18 అధ్యాయాలను పఠనం చేసి బహుమతులు పొందుతున్నారని, ఈ ప్రాంతం నుంచి ఎవరూ రావడం లేదని తెలిపారు. గొప్పవాళ్లం కావాలంటే గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, పెంట వశిష్ఠ కార్తికేయ శర్మ, గుమ్మా నగేష్, నిష్టల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలి



చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులకు సమస్య వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్ : మండలంలోని బొంతలకోడూరులోని మలిపెద్దవాని చెరువు పునరుద్ధరణకు ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది రూ.9 లక్షలు కేటాయించగా అందులో రూ.4..50 లక్షలు ఖర్చుకాగా, మిగిలిన నిధులు రూ. 4.50 లక్షలు మంజూరు చేయటం లేదని సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల జగదీశ్వరరావు అన్నారు. జిల్లా చెరువుల పరిరక్షణ ఫోరం ప్రతినిధులు సంధ్యతో కూడిన బృందం శనివారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు కూటమి నాయకులు చెరువును ఆక్రమించాలని చూస్తున్నారని, ఈ క్రమంలో నిధులు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. జిల్లా అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లనున్నట్లు చెరువుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు



చిన్నారావు, రాఘవరావులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : సుదీర్ఘకాలంగా ఏఆర్ ఎస్‌ఐ ఎం.చిన్నారావు, హెచ్‌సీ సీహెచ్ రాఘవరావులు పోలీసు సేవలందించడం అభినందనీయమని ఎస్పీ కె..వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొంది శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన వీరిని ఎస్పీ ఘనంగా సత్కరించారు.

4న రక్తదాన శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో రథసప్తమి నాడు ఈ నెల 4న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో–ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, ప్రతినిధులు పీజీ గుప్తా, జి.నారాయణరావు, నగిరి ఉపేంద్ర, గేదెల లక్ష్మీ, పొట్నూరు నాగేశ్వరరావు, ధర్మశాస్త సన్నిధానం ట్రస్ట్ వ్యవస్థాపకులు బరాటం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో యూటీఎఫ్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సంఘ నేతలు

శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం బాలుర పాలిటెక్నిక్ కాలేజీ, టీపీఎం, ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొండ కూర్మారావు, పి.సూర్యప్రకాష్, శాంతిప్రియ, సీతారాం, వైకుంఠరావు, అర్జున్, వెంకటరావు పాల్గొన్నారు.

నేడు 9 గంటలకు కుళాయి నీరు సరఫరా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో 1నుంచి 50 డివిజన్లలో ప్రతి రోజూ ఉదయం 6.30 గంటలకు ఇచ్చే మున్సిపల్ కుళాయి నీటిని ఆదివారం ఉదయం 9 గంటలకు సరఫరా చేయనున్నామని కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారంపేట ప్రధాన నీటి సరఫరా పంపు హౌస్ వద్ద రెండు పంపింగ్ మోటార్లు మరమ్మతుకు గురికావడంతో సరఫరా ఆలస్యం జరగనుందని, నగరవాసులంతా గమనించాలని కోరారు.

తక్కువ ధరలకే ఫుడ్ డెలివరీ



యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోటల్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం హోటల్ అసోసియేషన్, ఏపీ హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తక్కువ ధరలకే ఫుడ్ డెలివరీ చేస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఎం.నాగరాజు, వి.వెంకట్ ఆనంద్, ఆశీష్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో 'యమ్మీ' పేరిట కొత్త ఫుడ్ డెలివరీ యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.వినోద్, ఎస్.వెంకటసతీష్, టి.సుదర్శన్, ఎం.కొండలరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని కంపోస్టు కాలనీలో పద్మశాలి సంఘ కార్యాలయంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పద్మశాలి సంఘం, ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేలండర్, డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పసగాడ రామకృష్ణ, యేసో శ్రీనివాసులు, తీడ ప్రసాదరావు, ఇమంది విశ్వేశ్వరరావు, గుదే సూర్యనారాయణ, గిడుతూరి చలపతిరావు, పందిరి చిన్నారావు, మల్లిబాబు, నర్శింగరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117 సవరణ ఉత్తర్వులను పునఃసమీక్షించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 117 సవరణ ఉత్తర్వులను వెంటనే పునఃసమీక్షించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 117 సవరణ మెమో ద్వారా ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు మూతపడే అవకాశముందన్నారు. డీఈఓను కలిసిన వారిలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, కార్యదర్శి గండెం రామారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రవి, ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎథిక్స్ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో శనివారం నిర్వహించిన నైతికత, మానవతా విలువల (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్‌బోర్డు జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించింది. మొత్తం 20390 మంది విద్యార్థులకు గాను 20180 మంది పరీక్ష రాశారు. కాగా, ఫస్టియర్ విద్యార్థులకు ఈ నెల 3న పర్యావరణ విద్య పరీక్ష జరగనుంది.

ఉరుకులు..పరుగులు..

- రథసప్తమి వేళ యుద్ధ ప్రాతిపదికన పనులు



ఫుట్‌పాత్ నిర్మాణాలు జరుగుతున్న దృశ్యం



అరసవల్లి రహదారిలో సూర్యుని బొమ్మలతో సెంట్రల్ లైటింగ్

అరసవల్లి : రథసప్తమి సందర్భంగా నగరంలో పలు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా నగరంలోకి ఆహ్వానం పలికే రహదారులను, ముఖ్యంగా అరసవల్లి ప్రధాన కూడలి, ఇతర మార్గాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అరసవల్లి ఆదిత్యాలయం ముందు అన్ని నిర్మాణాలను తొలిగించి భక్తుల ఆహ్లాదకర దర్శనాలకు ప్రాధాన్యతిచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇంద్రపుష్కరిణికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డును కొత్తగా నిర్మించారు. పాలకొండ రోడ్డులో డివైడర్ పనులు చేపట్టి, ముందున్న చెట్లను పూర్తిగా తొలగించి, గ్రీనరీ పనులకు శ్రీకారం చుట్టారు. అరసవల్లి కూడలి వద్ద ఫౌంటైన్ పనులు, ఫుట్‌పాత్ పేవ్‌మెంట్స్, గ్రీనరీ లుక్స్‌తో పాటు పాతబస్టాండ్ కూడలి నుంచి అరసవల్లి వరకు సెంట్రల్ లైటింగ్ తదితర ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్‌లో స్తంభాలకు అమర్చిన సూర్యుడి బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే అరసవిల్లి మిల్లు కూడలి నుంచి అసిరితల్లి అమ్మవారి ఆలయం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా సైడ్‌బర్మ్‌లను కాంక్రీట్‌తో నింపి రహదారిని వెడల్పు చేశారు. దాదాపుగా కాలువకు దగ్గరగా ఏ దుకాణం, నిర్మాణం లేకుండా ముందుగానే కార్పొరేషన్ అధికారులు తొలిగించేశారు. సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేయడంతో అరసవల్లి రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎమ్మెల్యే శంకర్ హడావుడి కాస్త తగ్గడం, పనులు నాణ్యతగా చేపట్టడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్న క్రమంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

పకడ్బందీగా బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్ : నేటి నుంచి జరగబోయే రథసప్తమి వేడుకల్లో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లుపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తుది పరిశీలన చేశారు. ఈ మేరకు ఎస్పీ శనివారం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం నలువైపులా సందర్శించి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్లు, టికెట్ విక్రయకేంద్రాలు, ప్రసాదం కేంద్రం, భక్తులు ప్రవేశ, ఎగ్జిట్‌మార్గాలు, ఉచిత దర్శనం, క్యూలైన్ వెళ్లే ఇంద్ర పుష్కరిణి పరిసరాలను పరిశీలించారు. ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్, అరసవల్లి ఎంపీయూపీ పాఠశాల, వాడాడ జంక్షన్, 80 ఫీట్ రహదారి మార్గంలో ఏపీహెచ్‌బీ కాలనీ వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడపు నాయుడు, తదితరులున్నారు.

రథసప్తమి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: రథసప్తమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అసరవల్లి సూర్యనారాయణస్వామి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర పండుగల్లో భాగంగా గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించాలని క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్, కలెక్టర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పోటీలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా ఆది, సోమవారం రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. నేడు ఉదయం 10 గంటలకు ఈ పోటీలు మొదలుకానున్నాయి. ఇందుకు జిల్లా క్రీడప్రాధికార సంస్థ అధికారులు, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్ రావు నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

వాలీబాల్ పోటీలు..

రాష్ట్రస్థాయిలో నిర్వహించే వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండు కోర్టులను ఫ్లడ్ లైట్లతో, మరో కోర్టును సబ్‌కోర్టుగా ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి వాలీబాల్ జట్లు చేరుకుంటున్నాయి. జిల్లాస్థాయిలో జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలతోపాటు గ్రామీణ క్రీడలగా కర్రసాము, సంగిడీలు, ఉలవల బస్తాల లిఫ్టింగ్, పిల్లిమొగ్గలు పోటీలు నిర్వహించనున్నారు.